# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 238 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 23 ఆగస్టు 2026


## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి




## చిరంజీవి సేవా స్ఫూర్తే అభిమానులకు ఆదర్శం




### పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా

# ఎంచుకోండి

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం
- టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు..అపార అవకాశాలు
- అభివృద్ధి... జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలి
- మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణకు రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... తెలంగాణలోనే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను ఇక్కడే ఊహిద్దాం... ఇక్కడే ఆవిష్కరిద్దాం... ఇక్కడి నుంచే ప్రపంచానికి అందిద్దాం'అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి, పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శనివారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2026'లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు. ౖ÷లం గాణ అభివృద్ధి ప్రస్థానం కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, మిగతా2లో...



# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

### కాంగ్రెస్‌కు నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోం

### హెచ్చరించిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని

మిగతా2లో...



### తెలంగాణలో విద్యా,పరిశోధనలకు

# కేంబ్రిడ్జ్ సహకారం

- యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్ చర్చలు
- హైదరాబాద్‌లో విద్యావ్యవస్థ పటిష్టతకు అంగీకారం

**హైదరాబాద్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధులు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు, ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా మిగతా2లో...

### దానం నాగేందర్

# అనర్హత పిటిషన్

- తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు




### ఇందిరమ్మ ఇళ్ల పేరుతో

# ఓట్లు అడగం

- అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు
- హైదరాబాద్ తరహాలో హౌజింగ్ టవర్స్ నిర్మాణం
- నిజామాబాద్ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**నిజామాబాద్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి.. ఆ పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో పర్యటించిన మంత్రి.. నగరంలో హౌసింగ్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న

మిగతా2లో...


# నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

- ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది
- ఉప్పల్ బాధితులతో హరీష్ రావు




## గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతుస్తుల భవనం

- ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు




## పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

- ఆధునికత సాంకేతికతపై ప్రదర్శన




**హైదరాబాద్, 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని నెక్లెస్ రోడ్‌లో పీపుల్స్ ప్లాజా లో పవర్ ఎగ్జిబిషన్-2026 ఘనంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న

మిగతా2లో...

# 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

- ట్రంప్ సర్కార్ నిర్ణయాన్ని కొట్టివేసిన న్యాయస్థానం



**వాషింగ్టన్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను

మిగతా2లో...

### 22ఏ నిషేధిత భూముల పేరిట

# పెద్దఎత్తున అక్రమాలు

- భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్



# పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకోండి

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2025-26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్?2047' దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశర చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు. ఈ లక్ష్యసాధన కోసం రాష్ట్రాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే nvF,నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే ఖజఖీఇ, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి...

ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతి ఫలించాలి' అని ఉత్తమ్ స్పష్టం చేశారు.

ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతా లకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలు మూలలా విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబి లిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు.

ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలి టీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు.

# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కొండా సురేఖ విషయంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. కొండా సురేఖ వివరణ చదివామని తెలిపారు. కొండా సుస్మిత మాటల వీడియోలను చూశామని చెప్పారు. ముఖ్యమంత్రిపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. మంత్రి సురేఖ వివరణపై మరోసారి సమావేశం కావాలని భావించామన్నారు. క్రమశిక్షణ కమిటీకి మరి కొందరు ఎమ్మెల్యేలు మరిన్ని వివరాలు ఇస్తామన్నారని చెప్పారు. అలాగే, చిన్నారెడ్డి వివరణ లేఖ చదివామని మల్లు రవి అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యల వీడియోలు చూశామని తెలిపారు. చిన్నారెడ్డి విషయంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డితో మాట్లాడతామని అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలకు, మేఘా రెడ్డి ఫిర్యాదుకు చాలా అంతరం ఉందని చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడిన అంశాలు తనకు తెలుసని.. కానీ ఒక ప్రాసెస్ ప్రకారం విచారణ ఉంటుందని మల్లురవి తెలిపారు. ఆయా వ్యక్తులపై తమకు ఎలాంటి అభిప్రాయం ఉండదని చెప్పారు. పార్టీనే తమ మొదటి ప్రాధాన్యం అని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ వివరణ లేఖ తమకు అందిందని మల్లురవి తెలిపారు. తన వ్యాఖ్యలపై కంది శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారని అన్నారు. ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడిని ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేశామని చెప్పారు. కంది శ్రీనివాస్ రెడ్డి అంశాన్ని సైతం మరోసారి కూర్చొని మాట్లాడతామని మల్లురవి పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఓట్లు అడగం

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణం చేపడతామని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 230 రూపాయలకే సిమెంట్ బస్తాఇవ్వడానికి కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు మంతంరి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగింది. పట్టణంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్దిదారులకు మంజూరు అంజేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, మరియు గృహనిర్మాణ అంశాల మీద అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ షాపింగ్ కాంప్లెక్స్ లో గంగస్థాన్ ఫేజ్ 2 భవనానికి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. నిజామాబాద్ జిల్లాలోని వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి మరియు గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు భూమి పూజ చేయడం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలో సంవత్సరానికి 2 లక్షల చొప్పున ఇండ్లు కట్టి ఉంటే పదేండ్లలో 20లక్షల ఇండ్లు పూర్తి అయ్యేవి. కేవలం 60 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసింది. 30వేల ఇండ్లను మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసేసింది. నిజామాబాద్ టౌన్ లో కూడ సుమారు 400 ఇండ్లను అసంపూర్తిగా వదిలేస్తే, ప్రజాప్రభుత్వం వచ్చాక వాటికి నిధులు కేటాయించి నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండేలా యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి, డ్రా పద్దతిలో అర్హులైన పేదలకు ఇండ్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 3 కోట్ల 72 లక్షల 65 వేల చెక్కు అందజేశాము. రాబోయే 20 రోజుల్లో నిజామాబాద్ టౌన్ లో పైలట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణాలు శ్రీకారం చుట్టబోతున్నాం. సొంత జాగలేని అర్హులైన నిరుపేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని అన్నారు. ఇక సిమెంట్ బస్తా ధర 330 వరకు ఉంది. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి అది భారంగా కాకుడదు అనే ఆలోచనతో ప్రజాప్రభుత్వం సిమెంట్ పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి, ఒప్పించి 230 రూపాయలకే సిమెంట్ బస్తా అందించేలా ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు.

# 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్దఎత్తున అక్రమాలు

**హైదరాబాద్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా?

ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమీషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమీషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధా నం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మె ల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది.

ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు.

# పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రదర్శనలో విద్యుత్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతల ను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను ప్రజలకు పరిచయం చేయడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో విద్యుత్ భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

స్మార్ట్ మీటరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునేలా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.

# హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో పేలుడు

## - ఇద్దరు కార్మికుల మృతి..క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలింపు

**యాదాద్రి,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ భారీ శబ్దంతో పేలింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

కంపెనీలోని సి-బ్లాక్‌లో నైట్ షిఫ్ట్‌లో 18 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. రియాక్టర్ వద్ద పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి పెద్దవూర మండలానికి చెందిన చిన్న నాగిరెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన నాగన్న బోయిన నరేష్‌కుమార్ మృతి చెందారు. రియాక్టర్ సమీపంలో పనిచేస్తున్న మరో పది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రియాక్టర్ పేలిన శబ్దం భారీగా వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్‌రెడ్డి, ఎస్సై జగన్ పోలీసు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. చౌటుప్పల్, హయత్‌నగర్ నుంచి ౹÷ర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హెజో లేబొరేటరీస్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత జూలై 16న రసాయన వాయువులు పీల్చడంతో అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లు గ్రామానికి చెందిన ఆలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఘటన జరిగి నెల రోజులు కూడా పూర్తికాకముందే తాజాగా రియాక్టర్ పేలడంతో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం తర్వాత కంపెనీ పరిసరాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ఆవరణలో మురుగునీరు చేరి ఉండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ దుర్వాసన కారణంగా కొందరికి తలతిరగడం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురైనట్లు చెబుతున్నారు.

# 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. 75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతుస్తుల భవనం

## - ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గామాలు

**హైదరాబాద్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్ప కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే, నాలాను ఆనుకుని 50 గజాల్లో అక్రమంగా ఈ భవనాన్ని నిర్మించారు.

ఈ నిర్మాణం కూలిన పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై శకలాలు పడ్డాయి. భయంతో పక్కనే ఉన్న హాస్టల్లోకి విద్యార్థులు పరుగులు తీశారు. ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ ఎలానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిం దే. క్షేత్రస్థాయిలో టౌన్ ఎలానింగ్ అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రమంగా బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాల నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. అయిన హైడ్రా, సీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణలో విద్యా,పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. ముఖ్యంగా విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించడం, సంయుక్త పరిశోధనలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ప్రతినిధులు కేంబ్రిడ్జ్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంబ్రిడ్జ్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు, పరిశ్రమలు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై కూడా సమావేశంలో వివరించారు. అదేవిధంగా సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. తెలంగాణ యువతలో ఉన్న ప్రతిభను ప్రపంచస్థాయి వేదికలకు తీసుకెళ్లేందుకు కేంబ్రిడ్జ్ సహకారం అందించడంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై కేంబ్రిడ్జ్ విద్యావేత్తలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

**హైదరాబాద్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ం బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కోడై కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ం భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి మీ సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ం నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# దానం నాగేందర్ అనర్హత పిటిషన్

## - తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

**హైదరాబాద్,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

## ఎస్టీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్



**మల్లంపల్లి, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉపాధ్యాయ, ఉద్యోగులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) తక్షణమే పునరుద్ధరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) ములుగు జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల భవిష్యత్ భద్రతకు పాత పెన్షన్ విధానం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.శనివారం మల్లంపల్లి మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సతీష్‌కుమార్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు భవిష్యత్ ఆర్థిక భద్రతపై ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.అదేవిధంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్, జీఎల్ఐ బిల్లులను కూడా ఆలస్యం చేయకుండా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఎస్టీయూ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని సతీష్‌కుమార్ హెచ్చరించారు. సంఘ సభ్యత్వాన్ని పెంచడంతో పాటు ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు.**మల్లంపల్లి మండల ఎస్టీయూ నూతన కమిటీ**అనంతరం మల్లంపల్లి మండల ఎస్టీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. కోయగూడం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇజ్జిగిరి ఆగయ్యను మండల అధ్యక్షుడిగా, భూపాల్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కానుగుల రవికుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా, గుర్తూరు తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కే. మహేష్‌ను ఆర్థిక కార్యదర్శిగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ సంఘాన్ని మండలంలో మరింత బలోపేతం చేసి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ బాధ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని, మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను ఎస్టీయూ వేదికగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలకు స్ఫూర్తి ఫౌండేషన్ అండ

## 50 డ్యూయల్ డెస్క్ బెంచీల వితరణ

## విద్యార్థుల సౌకర్యం కోసం రూ.3.50 లక్షల విలువైన ఫర్నిచర్ అందజేత

**కల్లూరు, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే సంకల్పంతో స్ఫూర్తి ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు కొనియాడారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఈ కామ్ (యూఎస్ఏ) ఫౌండేషన్ సౌజన్యంతో, స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో రూ.3.50 లక్షల విలువైన 50 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. గతంలో కల్లూరు మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు సందర్శించిన సమయంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు బెంచీలు లేక నేలపై కూర్చొని విద్యాభ్యాసం చేస్తున్న పరిస్థితిని గుర్తించారు. దీనిపై స్పందించిన ఫౌండేషన్ సభ్యులు విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు తమవంతు సహాయం అందించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ప్రస్తుతం కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించారు. పాఠశాలల వారీగా బెంచీల పంపిణీ లో భాగంగా కాలాలివాడ పాఠశాలకు 7, గోపాలదేవబోయినపల్లి పాఠశాలకు 10, కిష్టయ్య బంజర్‌కు 3, పుల్లయ్య బంజర్‌కు 8, వచ్చానాయక్ తండాకు 8, హనుమా తండాకు 3, తూర్పు లోకవరానికి 3, పడమట లోకవరానికి 8 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను గుర్తించి, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఫర్నిచర్ అందించడం ద్వారా స్ఫూర్తి ఫౌండేషన్ సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఇలాంటి సహకారం అందించడం వల్ల వారి ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు, సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. **త్వరలో మండలంలోని మరిన్ని పాఠశాలలకు సహాయం** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలతో పాటు కల్లూరు మండలంలోని ఇతర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు కూడా త్వరలో డ్యూయల్ డెస్క్ బెంచీలు అందించనున్నట్లు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి తమ ఫౌండేషన్ తరఫున నిరంతరం సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కల్లూరు మండల ఎంఈఓ పద్మ, జిడిబి పల్లి ఉపాధ్యాయురాలు మోదుగు శిరీష, స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, చింతలపూడి కృష్ణ, మద్రెల వెంకటేశ్వరరావు, ఉబ్బన వేణుబాబు, ఎస్.కె. ముజీమ్, తెల్లపుట్ట రాంబాబు, వీరేంద్ర, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. **విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి** ప్రభుత్వ పాఠశాలలకు కేవలం ఆర్థిక సహాయం చేయడమే కాకుండా, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సమకూర్చేందుకు స్ఫూర్తి ఫౌండేషన్ ముందుకు రావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతున్నారు.







# విద్యార్థుల సంక్షేమానికి పొంగిలేటి ట్రస్ట్ సేవలు అభినందనీయం

## విద్యార్థులకు పిఎస్ఆర్ ట్రస్ట్ అండ

## 250 ప్లేట్లు, 250 గ్లాసుల పంపిణీ

## కల్లూరు ఏసీపి వసుంధర యాదవ్

**కల్లూరు, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :**విద్యార్థుల సంక్షేమం పట్లఅవసరాలను గుర్తించి పొంగులేటి ట్రస్ట్ ఆధ్వర్యంలో 250 ప్లేట్లు, 250 గ్లాసులు అందించడం అభినందనీయమని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమని, సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని ఆమె కోరారు.విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సతీమణి పొంగులేటి మాధురి సేవా దృక్పథంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని పలువురు కొనియాడారు. ఇందులో భాగంగా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల విద్యార్థుల కోసం పొంగులేటి ట్రస్ట్ ఆధ్వర్యంలో 250 ప్లేట్లు, 250 గ్లాసులు అందజేశారు.ఈ సామగ్రిని ముఖ్య అతిథిగా హాజరైన కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఏసీపీ వసుంధర యాదవ్, ఎస్సై హరితలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అవసరాలను గుర్తించి ప్లేట్లు, గ్లాసులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దాతలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, ఎంఈఓ పద్మ, 15వ వార్డు కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్, కల్లూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉస్మాన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.









# చిరంజీవి సేవా స్ఫూర్తే అభిమానులకు ఆదర్శం

- చిరంజీవి అభిమాన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బొచ్చు భాస్కర్





**పరకాల, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):**పరకాల పట్టణంలోని జయ డీలక్స్ రోడ్డులో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమాన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బొచ్చు భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మడికొండ శీను ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభిమానులు కేక్ కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బొచ్చు భాస్కర్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా చిరంజీవి జన్మదిన వేడుకలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. చిరంజీవి కేవలం సినిమాల్లోనే కాకుండా సమాజ సేవలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. నేత్రదానం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలకు చిరంజీవి ఇచ్చిన ప్రాధాన్యమే తమను ఆయన అభిమానులుగా మార్చిందని పేర్కొన్నారు. చిరంజీవి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులోనూ అభిమాన సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని బొచ్చు భాస్కర్ తెలిపారు.అభిమానులు బ్రెడ్డు పండ్లు పేదవారికి, వృద్ధులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు బోచ్చు రవికుమార్, బొచ్చు మహేష్, మేకల దిలీప్, ఒంటేరు రాజు, దొమ్మటి శ్రీను యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం




**మల్లంపల్లి, ఆగస్టు 22(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి పదో తరగతి మిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. మండల కేంద్రానికి చెందిన తమ పదో తరగతి మిత్రుడు కట్ల గణపతి తండ్రి కట్ల సూరయ్య ఇటీవల మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మిత్రులంతా స్పందించారు. గణపతి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా మిత్రులంతా మాట్లాడుతూ సూరయ్య మృతి తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. కష్టసమయంలో గణపతి కుటుంబానికి మిత్రులందరూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం పదో తరగతి మిత్రుల ఆధ్వర్యంలో సేకరించిన రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని కట్ల గణపతి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా స్నేహబంధం, మానవతా విలువలను చాటుకున్నారు. తమకు అండగా నిలిచిన మిత్రులకు గణపతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బైకాని మహేందర్ యాదవ్, జెట్టి విజయ్ కుమార్, మొర్రి రాజు యాదవ్, బానోతు శీను, కొయ్యడ విజయ్ కుమార్, అర్షం రాజ్ కుమార్, నత్తి రాజు, తోట నవీన్ తదితర పదో తరగతి మిత్రులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకులాల్లో పార్ట్‌టైం టీచర్ పోస్టులు

**ఏటూరునాగారం: ఆగస్టు 22(పిసిడబ్ల్యూ న్యూస్):** 2026-27 విద్యా సంవత్సరానికి జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పార్ట్‌టైం ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు TGTWREI సొసైటీ రీజినల్ కోఆర్డినేటర్ తెలిపారు.మహిళలకు పీజీటీ హిందీ, జేఎల్ ఇంగ్లీష్, పురుషులకు పీజీటీ గణితం, జేఎల్ జూలజీ పోస్టులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ పోస్టులు బాలుర, బాలికల పాఠశాలలు, కళాశాలలకు సంబంధించినవిగా తెలిపారు. అర్హతలు తప్పనిసరిసంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీ.ఎడ్, టెట్ ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉండాలి. డిగ్రీ లేదా పీజీలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. జేఎల్ పోస్టులకు SET/NET అర్హత కూడా కలిగి ఉండాలని అధికారులు తెలిపారు.27న ఏటూరునాగారంలో డెమో అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు లిఆగస్టు 27వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ఏటూరునాగారంలోని TGTWR స్పోర్ట్స్ స్కూల్ (బి)లో నిర్వహించే డెమోకు హాజరు కావాలి. డెమోలో అభ్యర్థులు ప్రదర్శించే ప్రతిభ ఆధారంగానే ఎంపిక ప్రక్రియ ఉంటుందని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకోసం 9959072997,8309452015 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# టిజీఎస్ ఆర్టీసీ బస్ తొర్రూరు డిపోలో కార్గో పార్సల్ వేలం పాట



**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 22(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా,తోరూర్ పట్టణ వ్యాపారస్తులకు మరియు కార్గో వినియోగదారులకు విజ్ఞప్తి.సంవత్సర కాలం నుండి తోరూర్ లాజిస్టిక్స్ కార్గో నందు కస్టమర్స్ తీసుకు వెళ్ళలేని పార్సల్స్ ను టి జి ఎస్ ఆర్టిసి సంస్థ నిబంధన మేరకు ఈనెల సోమవారం 24వ తేదీన మధ్యాహ్నం 1.30కి తొర్రూరు డిపో ఆవరణంలో పార్సెల్లును వేలంపాట వేయడం జరుగుతుంది. ఆసక్తి గల వినియోగదారులు తొర్రూర్ డిపో కి సకాలంలో వచ్చి వేలంపాటలో పాల్గొనవచ్చు అని తోరూర్ డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి తెలియజేశారు.ఇతర వివరాల కొరకై డిపోలోని లాజిస్టిక్స్ ఇన్చార్జి నెంబర్ ను 9154298766 సంప్రదించగలరు.

# పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఏఈఆర్ఓలు పోలింగ్ కేంద్రాలనుం క్రమం తప్పకుండా సందర్శించాలి**

**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి**

**బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి**


**పాలంపేట, చల్వాయి పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన భారత ఎన్నికల సంఘం కార్యదర్శి**

**నవీన్ కుమార్, కార్యదర్శి, భారత ఎన్నికల సంఘం**

**ములుగు జిల్లా ఆగష్టు22(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, శనివారం ములుగు జిల్లాలో పర్యటించారు. జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను నవీన్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితి, ఓటర్లకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, బీఎల్ఓల పనితీరు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో చేపడుతున్న క్షేత్రస్థాయి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చల్వాయి గ్రామ ప్రజలతో కూడా ఆయన ప్రత్యక్షంగా మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాల పరిశీలన, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకున్నారు. బీఎల్ఓలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని నవీన్ కుమార్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, లోటుపాట్లు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏఈఆర్ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని, కేవలం కార్యాలయ స్థాయి సమీక్షలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో బీఎల్ఓల పనితీరు, ఓటర్లకు అందుతున్న సేవలు, పోలింగ్ కేంద్రాల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నవీన్ కుమార్, కార్యదర్శి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ2026 పురోగతిపై ఏఈఆర్ఓలు, సంబంధిత ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ







ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్‌గా నమోదైన వారి వివరాలను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. 109ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,01,964 మంది పురుషులు, 1,07,143 మంది మహిళలు, 21 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 11,308 నో మ్యాపింగ్ కేసులు, 30,326 అనామలీస్ కేసులు కలిపి మొత్తం 41,634 కేసులు ఉన్నాయని అధికారులు వివరించారు. వీటిపై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొ ందించినట్లు తెలిపారు. నో మ్యాపింగ్, అనామలీస్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి కేసులో వాస్తవ పరిస్థితిని నిర్ధారించిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలని నవీన్ కుమార్ సూచించారు. ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఓటరుకు అందుబాటులో ఉండాలని, ఓటర్ల జాబితాలో వివరాలకు సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం, సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఏఈఆర్ఓలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని, ఓటర్ల జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణవేణి, 10 మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు సలీం, డిటి నితీష్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# బోడుప్పల్ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు

- అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి: రామోల శ్రవణ్ కుమార్
- బోడుప్పల్ టీఎన్ఎస్ అధ్యక్షులు రామోల శ్రవణ్ కుమార్



**బోడుప్పల్ ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్కాజిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు, భక్తులకు బోడుప్పల్ టీఎన్ఎస్ అధ్యక్షులు రామోల శ్రవణ్ కుమార్ పవిత్ర బోనాల పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నాడు అత్యంత వైభవంగా జరగబోయే ఈ శ్రావణ బోనాల మహోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ. బోడుప్పల్ డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, శ్రీ అమ్మవారు ప్రజలందరిపై తమ చల్లని చూపు నిలపాలని కోరుకుంటున్నాను,“ అని తెలిపారు. భక్తులందరూ పండుగను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని, ఆలయ కమిటీ నిర్వాహకులు మరియు యంత్రాంగానికి సహకరిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# కమలాపూర్‌రామ్‌నగర్ రహదారిపై భారీ గుంత.. ప్రమాదాలకు ఆహ్వానం



**ములుగు జిల్లా,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** కమలాపూర్ నుంచి రామ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రహదారి మధ్యలో ఏర్పడిన గుంత రోజురోజుకూ పెద్దదవుతుండటంతో ఈ మార్గంలో ప్రయాణించే రైతులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో గుంత సరిగా కనిపించకపోవడంతో వాహనాలు అందులో పడిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గుంత వద్ద ప్రమాద సూచికలు లేకపోవడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఈ రహదారి రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన మార్గం కావడంతో సంబంధిత రోడ్డు అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చి, రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా ముందుగానే అధికారులు స్పందించి వాహనదారుల భద్రతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# మూడు వాహనాల్లో తప్పిదం ఎవరిది? పోలీసులు ఏ డ్రైవర్ పై చర్యలు తీసుకుంటారు?

**● దేవుడిలా నిలిచిన లారీ డ్రైవర్. ● సెయింట్ పాల్ స్కూల్ 50 మంది పిల్లల ను కాపాడి న లారీ డ్రైవర్. ● అతి వేగం బ్రేక్ పడక పోవడం డ్రైవర్ నిర్లక్ష్యం. ● భయాందోళనకు గురైన విద్యార్థులు . ● ఊపిరి పీల్చుకున్న తల్లి తండ్రులు. ● డ్రైవర్ సీట్‌లో కూర్చోగానే కొందరు డ్రైవర్లు రన్ వే పై వెళ్తున్న విమానం నడిపే వారిలా ఫీల్ అవుతారు కొందరు?.తరచూ మనం చూస్తూనే ఉన్నాం కొన్ని ప్రైవేటు వాహనాల బస్సు డ్రైవర్లు, మాత్రం బస్సులో ఉండే విద్యార్థుల భవిష్యత్తు ● మొత్తం వారి చేతుల్లోనే ఉందని ఆలోచన చేయకుండా వారికి తోచిన రీతిలో బస్సులు నడుపుతూ ప్రమాదాలకు గురిచేస్తున్నారు? ● వీరు మామూలు రహదారిలోనే ఇలా నడిపితే నేషనల్ హైవే పై ఎలా వెళ్తారు ఒకసారి మీరే ఆలోచన చేయండి.**

**తొర్రూరు ప్రతినిధి,ఆగస్టు 22(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మున్సిపల్ పరిధిలో వరుసగా రెండవ రోజు స్కూల్ పిల్లలు ప్రమాదం నుండి బయటపడ్డారు. ఉదయం 8:30 గంటల ప్రాంతంలో నాంచారి మడూర్ నుండి సెంట్ పాల్ స్కూలుకు50 మంది పిల్లలను తీసుకొస్తున్న క్రమంలో స్కూల్ దగ్గర డ్రైవర్ లారీని ఓవర్టేక్ చేసి స్కూల్ లోకి తీసుకెళ్లే లోపల భారీ ప్రమాదం జరిగినది. వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ నీ ఓవర్టేక్ చేసే టైంలో బస్ డ్రైవర్ పిల్లలు ఉన్నారనే విషయం మర్చిపోయి అతివేగంతో నడపడంతో బ్రేక్ పడకపోవడంతో లారీని దాటే సమయంలో లారీ డ్రైవర్ పూర్తి ఎడమ చేయి వైపు దిగిన భారీ ప్రమాదం జరగక తప్పలేదు. ప్రమాదం పొంచి ఉందనే సమయాన్ని పసిగట్టిన లారీ డ్రైవర్ పూర్తిగా రోడ్డును దింపడంతో భారీ ప్రమాదము జరగకుండా పిల్లల ను రక్షించిన వాడిగా లారీ డ్రైవర్ చాకచక్యానికి పిల్లల తల్లిదండ్రులు రుణపడి ఉంటారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం బస్సు డ్రైవర్లు నిర్లక్ష్య వైఖరితో అధికారులు పిల్లల రక్షణకు పాఠశాల యాజమాన్యం నుండి ఎలాంటి హామీ ఇస్తారు ఈ దుర్ఘటన పై ఆర్ టి ఏ అధికారులు గానీ విద్యాశాఖ అధికారులు కానీ పాఠశాలలపై ఏం చర్యలు




తీసుకుంటారనేది ఉత్కంఠతో చూడవలసిన సమయం. ప్రైవేట్ పాఠశాలలను కాపాడేందుకు అధికారులు సమయతమవుతారో, పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుండి తల్లిదండ్రులకు ఏ విధమైన రక్షణ ఇప్పిస్తారో మునుముందు అధికారులు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ప్రతిరోజు ఏదో ఒకచోట ఇంత గోర సంఘటనలు జరిగిన మండల విద్యాశాఖ అధికారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటాము అనేది విలేకరులకు తెలపకపోవడం పిల్లల తల్లిదండ్రులకు ఏం భరోసా ఇస్తారా అనేది అధికారుల ఒంటెద్దు పోకడకు నిదర్శనం. ఏదైనా సంఘటన జరిగితే కానీ చర్యలు తీసుకునే పరిస్థితిలో అధికారులు లేరనేది స్పష్టమైన సంకేతం గా విధితమైతుంది. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడి పాఠశాలలపై చర్యలు తీసుకొని పిల్లల తల్లిదండ్రులకు మేమున్నామని భరోసా కోసం ఎదురుచూస్తున్న తొర్రూర్ పట్టణ ప్రజలు.

# టీసీసీ మీడియా అధ్యక్షులుగా నారపోగు ప్రసాద్

**తల్లాడ, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ మీడియా జిల్లా అధ్యక్షులుగా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన నారపోగు ప్రసాద్ ను ఎన్నుకొన్నారు. శనివారం ఖమ్మంలో జరిగిన టిసిసి 13వ వార్షికోత్సవ సభలో ఆయనను జిల్లా అధ్యక్షులుగా ప్రకటించారు. ఈ సందర్భంగా టిసిసి వ్యవస్థాపక అధ్యక్షులు మానుకొండ సుదర్శనం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో టిసిసి బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనను నియమించిన రాష్ట్ర టిసిసి ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# డ్రోన్‌తో మందుల పిచికారీ.. రైతులకు కొత్త టెక్నాలజీతో సులువైన సాగు

**ములుగు జిల్లా,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ రైతులు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రామన్నగూడెం సరిహద్దులో ఓ రైతు తన పొలంలో డ్రోన్ ద్వారా పంటకు మందుల పిచికారీ ప్రారంభించారు. డ్రోన్‌తో మందులు పిచికారీ చేస్తున్న దృశ్యాలు ప్రస్తుతం ఆసక్తిని కలిగిస్తున్నాయి.గతంలో రైతులు పొలాల్లో మందులు పిచికారీ చేసేందుకు కూలీలను ఆశ్రయించడంతో పాటు ఎక్కువ సమయం, శ్రమ, నీరు ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో తక్కువ సమయంలో పెద్ద విస్తీర్ణంలో మందులు పిచికారీ చేసే అవకాశం ఏర్పడుతోంది. దీంతో రైతులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి



చూపుతున్నారు.**ఎకరాకు రూ.400 ఖర్చు.. 12 లీటర్ల నీటితో పిచికారీ** డ్రోన్ ద్వారా పంటకు మందులు పిచికారీ చేయడానికి ఎకరానికి సుమారు రూ.400 ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఒక ఎకరానికి కేవలం 12 లీటర్ల నీటిని ఉపయోగించి మందుల పిచికారీ చేయడం సాధ్యమవుతుండటం విశేషం. తక్కువ నీటితో తక్కువ సమయంలో పిచికారీ పూర్తవుతుండటంతో రైతులకు సమయం, శ్రమ ఆదా అవుతున్నాయి.**ఆధునిక వ్యవసాయం వైపు రైతుల అడుగులు**వ్యవసాయ రంగంలో రోజురోజుకూ కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వస్తుండటంతో రైతులు వాటిని వినియోగించుకునేందుకు ముందుకు వస్తున్నారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా మందుల పిచికారీతో పాటు భవిష్యత్తులో పంటల పర్యవేక్షణ, ఎరువుల వినియోగం వంటి వ్యవసాయ పనుల్లోనూ సాంకేతిక పరిజ్ఞానం మరింత ఉపయోగపడే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించి, డ్రోన్ సేవలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

## కుప్పెనకుంట్ల పెరువంచ రహదారి సమస్యపై సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయి పరిశీలన



**కల్లూరు, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు, పెనుబల్లి మండలాలకు సంబంధించిన కుప్పెనకుంట్ల, పెరువంచ గ్రామముల రహదారికి సంబంధించిన సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించబడిందని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ రహదారి పరిస్థితిని, సంబంధిత సమస్యలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో పాటు ప్రభావిత రైతులతో చర్చించి, వారి సమస్యలు మరియు అభ్యంతరాలను తెలుసుకున్నారు. సమస్యకు సాధ్యమైన పరిష్కార మార్గాలపై అధికారులతో సమీక్షించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలు మరియు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చట్టబద్ధమైన, ఆచరణ సాధ్యమైన, సానుకూల పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల నివేదికలు సిఫారసుల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య తీవ్ర అక్షేపనీయం!

**● సామాజిక న్యాయ వేదిక ఖండన ● హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ**




**వరంగల్, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నాగార్జున హైస్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్యను సామాజిక న్యాయ వేదిక (సోషల్ జస్టిస్ ఫోరం) నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వరంగల్ ఎంజీఎం ప్రాంతంలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి జ్ఞాపకార్థం, ఆమె హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సోషల్ జస్టిస్ ఫోరం జిల్లా కోశాధికారి బలవారి సుధీర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, పాఠశాల కరెస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ పలు కీలక విషయాలను వెల్లడించారు.ఉపాధ్యాయులపై దాడులు విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.తెలుగు రాష్ట్రాలలో విద్యార్థులే ఉపాధ్యాయులను హత్య చేసిన సందర్భాలు లేవని, విద్యాసంస్థలలో ప్రిన్సిపాల్ స్థాయి వ్యక్తి హత్యకు గురికావడం సమాజానికే మచ్చ అని సోషల్ జస్టిస్ ఫోరం గౌరవ అధ్యక్షులు సామల సుధాకర్, రాష్ట్ర ప్రధాన సలహాదారు కొమ్మినేని భూపాల్ రావు పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా లభించడం పోలీసు, ఇంటెలిజెన్స్, ఎక్సైజ్ శాఖల వైఫల్యమేనని ఫోరం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు ఏషబోయిన సాంబయ్య యాదవ్ ఆరోపించారు. హత్య జరిగి వారం రోజులు కావస్తున్నా సీసీ కెమెరాల్లో కనిపిస్తున్న వ్యక్తులు తమ కుమారుడు కాదని తల్లిదండ్రులు చెప్పడం, పోలీసు అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ హత్యపై సమగ్ర నిజనిర్ధారణ కమిటీని వేసి, అసలైన హంతకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షులు యాశెట్టి రాజేందర్ పటేల్, హన్మకొండ జిల్లా అధ్యక్షురాలు జోడుముంతల అనిత, రవీందర్, మురళీ యాదవ్, ఎంజీఎం హాస్పిటల్ నాయకులు రాజేష్, పలు పాఠశాలల కరెస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం కప్పతల్లి ఆట.. పెగడపల్లిలో మహిళల ప్రత్యేక పూజలు

**ములుగు జిల్లా,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** వర్షాలు కురవక పంట పొలాలకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ములుగు జిల్లా పెగడపల్లి గ్రామంలో గ్రామస్థులు వర్షాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చిన్నకుమారి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు కలిసి సంప్రదాయబద్ధంగా కప్పతల్లి ఆట ఆడుతూ వాన దేవుడిని వేడుకున్నారు.వర్షాలు సమృద్ధిగా కురిసి పంట పొలాలకు నీరు అందాలని ఆకాంక్షిస్తూ గ్రామంలోని మహిళలు కప్పతల్లి ఆటలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని పలు దేవాలయాలకు వెళ్లి నీటితో అభిషేకాలు చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మంచి వర్షాలు కురవాలని దేవుళ్లను ప్రార్థించారు.వర్షాలు లేక పొలాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దీంతో తమ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గ్రామస్థులు కప్పతల్లి ఆట నిర్వహించి వర్షాలు కురవాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నకుమారి మాట్లాడుతూ, గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు,



కుంటలు నిండి, రైతుల పంటలకు సాగునీరు అందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో పాడిపంటలు వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన ఈ సంప్రదాయ కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





# యువతకు దిశానిర్దేశం చేసే శక్తి కళలు, సంస్కృతికే ఉంది



**- ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం**

**హన్మకొండ, ఆగస్టు 22(పి సి డబ్ల్యూ న్యూస్):**ఆధునిక కాలంలో చెడు సావాసాలకు లోనై యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా కళలు, చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి వారికి దిశానిర్దేశం చేయగలవని ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. శనివారం హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ (వరంగల్) ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఓరుగల్లు జానపదాల స్వరాల ఝల్లు.. కాకతీయ సకల కళల జాతర' ఉత్సవాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ.. ఓరుగల్లు ఘనమైన కళలకు, అద్భుతమైన సంస్కృతికి నిలయమని అన్నారు. తెలంగాణ జానపద కళలు, కాకతీయుల కళా సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. అంతరించిపోతున్న కళారూపాలను భావితరాలకు అందించేందుకు కళా ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు పురాణాలు, చరిత్ర, ప్రాచీన కళలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కళల ద్వారా యువతలో సంస్కారం, సామాజిక బాధ్యత, సృజనాత్మకత పెంపొందుతాయని తెలిపారు. తెలంగాణలో లిపి లేని 103 రకాల కళారూపాల కళాకారులు ఇప్పటికీ తమ కళలపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని ఈగ మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కళాకారుల జీవనోపాధిని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుని ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు.జడల శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జనగాం రాము వ్యాఖ్యాతగా వ్యవహరించారు. డా. హరిప్రియా హరినాథ్, శంకర్ సారంగపాణి శిష్యులు, పలువురు గాయకులు, కళాకారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జానపద, ఒగ్గు, చిందు, యక్షగానం, భగవతం, శాస్త్రీయ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.




# ములుగు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఘనంగా ప్రారంభం



**- క్రీడాకారులను ఉత్సాహపరిచిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క**

**ములుగు, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లాలోని వివిధ మండలాలు, విద్యాసంస్థల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో ముచ్చటించారు. అనంతరం క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు.**క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సీతక్క సూచించారు. క్రీడలు కేవలం బహుమతులు సాధించేందుకు మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రతిభ కనబరచగలరని పేర్కొన్నారు.ములుగు జిల్లా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడలపై ఆసక్తిని మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. క్రీడా మైదానాలు, అవసరమైన సదుపాయాలు, శిక్షణ వంటి అంశాలపై దృష్టి సారిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు.**రాష్ట్ర స్థాయిలో రాణించాలి**జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై ములుగు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా కాకుండా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు.పోటీల ప్రారంభ సందర్భంగా వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో పాల్గొనే క్రీడాకారులు ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. పరుగుపందేలు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. **క్రీడాకారుల్లో ఉత్సాహం**మంత్రి సీతక్క పోటీలను ప్రారంభించడంతో క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. తమ ప్రతిభను నిరూపించుకునేందుకు క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. మైదానంలో క్రీడాకారుల ప్రదర్శనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కోచ్‌లు, అధికారులు ఆసక్తిగా తిలకించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడా శాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



# బీసీ మహిళా మంత్రిని తొలగిస్తే ఊరుకోం!

**● సోషల్ జస్టిస్ ఫోరం జిల్లా అధ్యక్షురాలు రేపల్లె స్వర్ణజ**



**వరంగల్, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీలోని కొందరు అగ్రకుల నాయకులు మొదటి నుండి బీసీ మహిళా నాయకురాళ్లను టార్గెట్ చేస్తూ అవమానిస్తున్నారని సోషల్ జస్టిస్ ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షురాలు రేపల్లె స్వర్ణజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బీసీ మహిళా నాయకురాలికి మంత్రి పదవి ఇస్తే, ఆ పదవి తమ దయాదాక్షిణ్యాల వల్లనే వచ్చినట్లు భావించడం మరియు తమకు లోబడి పనిచేయాలని చూడటం సరైన పద్ధతి కాదని ఆమె స్పష్టం చేశారు.బీసీ మహిళా మంత్రిపై జరుగుతున్న కుట్రలను తక్షణమే మానుకోవాలని, ఒకవేళ ప్రభుత్వం ఆ మంత్రిని పదవి నుండి తొలగించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్వర్ణజ హెచ్చరించారు. అగ్రకుల నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం బీసీ నాయకులను తొక్కేసే యత్నాలను సోషల్ జస్టిస్ ఫోరం ఎంతమాత్రం సహించదని స్పష్టం చేశారు.

# జాతీయ ఉత్తమ గ్రంథపాలకుడి పురస్కారం అందుకున్న డాక్టర్ రాజేశ్వర్ కుమార్



**పరకాల,ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా. ఎస్.ఆర్. రంగనాథన్ 134వ జయంతిని పురస్కరించుకుని చెన్నై లోని అన్నా యూనివర్సిటీలో మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో పరకాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథపాలకుడిగా సేవలందిస్తున్న డా. గుండా రాజేశ్వర్ కుమార్ కు జాతీయ ఉత్తమ గ్రంథపాలకుడి పురస్కారం అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆనంద్, ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి దొరస్వామి, మద్రాస్ గ్రంథాలయ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు డా. గుండా రాజేశ్వర్ కుమార్ కు ఈ పురస్కారాన్ని అందజేశారు.గ్రంథాలయ రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలు, విద్యార్థులకు సమాచారాన్ని చేరువ చేయడంలో చేస్తున్న కృషికి, గ్రంథాలయ సమాచార రంగములో చేస్తున్న పరిశోధనలకు గుర్తింపుగా ఈ జాతీయ స్థాయి పురస్కారం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డా. గుండా రాజేశ్వర్ కుమార్ ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి సంతోష్ కుమార్,అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రంథాలయ రంగ ప్రముఖులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

# కుల వివాదం.. సోషల్ మీడియాలో బెదిరింపులు

**- రామడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.. ఎఫ్ఐఆర్ నమోదు**

**రామడుగు,ఆగస్టు22(పీసీడబ్ల్యూ న్యూస్):** రామడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో భూ వివాదం, కుల వివాదం, సోషల్ మీడియాలో బెదిరింపులకు సంబంధించిన ఫిర్యాదు నమోదైంది. రామడుగు మండలంలోని గ్రామ శివారులో సర్వే నంబర్ 99/Aలో 6.36 గుంటల భూమి విషయంలో గ్రామానికి చెందిన కొంతమంది గౌడ కులస్తుల మధ్య వివాదం తలెత్తినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.తమ పెద్దమనిషి పొన్నం రామలక్ష్మి పేరుపై ఉన్న సదరు భూమిని గౌడ సంఘం పేరుతో మ్యుటేషన్ చేయాలని కొంతమంది తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, మరో వర్గం ఆ భూమి తమదేనని పేర్కొంటూ మ్యుటేషన్ చేయవద్దని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో గౌడ యువత వాట్సాప్ గ్రూపులో ఇరువర్గాల మధ్య వివాదాన్ని రెచ్చగొట్టేలా అసభ్యకరమైన పోస్టులు చేయడంతో పాటు, పిటిషన్‌ను వెనక్కి తీసుకోకపోతే చంపుతామని బెదిరింపులు చేసినట్లు ఫిర్యాదుదారులు ఆరోపించారు.అలాగే అనుపురం పరశురాములు, అనుపురం శ్రీనివాస్, గోనపల్లి దినేష్, అనుపురం అనిల్, పూరేళ్ల హరీష్, గోనపల్లి రాజయ్య తదితరులు గౌడ సంఘం సమావేశం నిర్వహించి, 20-08-2026న కొంతమంది వ్యక్తులను కుల బహిష్కరణ చేయాలని తీర్మానం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతేకాకుండా ఒక వర్గానికి చెందిన వ్యక్తులతో మాట్లాడిన వారికి రూ.5,000 జరిమానా విధిస్తామని, వారిని కులం నుంచి బహిష్కరిస్తామని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు.సోషల్ మీడియాలో చేసిన పోస్టులు, బెదిరింపుల కారణంగా తమకు ప్రాణహాని ఉందని, సామాజికంగా అవమానిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ ఫిర్యాదుపై రామడుగు ఎస్ఐ కె. రాజు ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

# ఎస్.ఎల్. గౌడ్‌కు అశ్రు నివాళి అర్పించిన డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం

**- ఎస్.ఎల్. గౌడ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికరం: డా.మేడిపల్లి సత్యం.**



**మానకొండూర్, ఆగస్టు 22(పిసి డబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ నియోజకవర్గం, మన్నెంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదగోని లక్ష్మీ నారాయణ గౌడ్ (ఎస్.ఎల్.గౌడ్) గుండెపోటుతో అకాల మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం పేర్కొన్నారు.నేడు మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి రమేష్, గోపు మల్లారెడ్డి, శ్రీనివాస రావు, మామిడాల అనిల్, ఒగ్గు దామోదర్ తదితరులతో కలిసి వారి స్వగ్రామం మన్నెంపల్లి లోని వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఎన్.ఎస్.యు.ఐ నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలు అందించడంతో పాటు సహకార సంఘం చైర్మన్ గా పదవి చేపట్టి ప్రజాసేవ చేసిన నాయకుడు ఎస్.ఎల్.గౌడ్ ని, కష్టకాలంలో పార్టీని వీడకుండా తన తుది శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ కోసం విధేయతతో పనిచేసిన నిజమైన కాంగ్రెస్ సైనికుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని అభిప్రాయపడ్డారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై సండ్ర ఆగ్రహం

**పేదలకు మెరుగైన వైద్యం అందించాలి**

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు:**

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**





**సత్తుపల్లి, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. 100 పడకల కొత్త ఆసుపత్రి భవనం అందుబాటులోకి రావడంతో పాటు సుమారు 17 మంది వైద్యులు ఉన్నప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. కొంతమంది వైద్యులు విధులకు సమయానికి హాజరు కావడం లేదని, మరికొందరు ముందుగానే విధుల నుంచి వెళ్లిపోతున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని సండ్ర తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. నిరుపేదలు, సామాన్య ప్రజలే ప్రధానంగా ఆశ్రయించే ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి పరిస్థితులు ఉండటం సరికాదన్నారు. ఆసుపత్రిలో మంచినీటి సదుపాయం సక్రమంగా లేకపోవడం, మృతదేహాలకు సకాలంలో పోస్టుమార్టం నిర్వహించకపోవడం వంటి సమస్యలపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయని సండ్ర తెలిపారు. కొన్ని ధ్రువపత్రాల జారీ కోసం డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలపైనా అధికారులు సమగ్రంగా దృష్టి సారించి విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఇటీవల రేజర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పాము కాటుకు గురైన అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, సుమారు రెండున్నర గంటల పాటు యాంటీ స్నేక్ వెనం (యాంటీడోట్) అందలేదనే ఆరోపణలు వచ్చాయని సండ్ర తెలిపారు. పరిస్థితి విషమించడంతో బాధితుడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రోగుల ప్రాణాలకు సంబంధించిన విషయంలో రాజకీయాలకు, ఒత్తిళ్లకు తావుండకూడదని సండ్ర స్పష్టం చేశారు. రాజకీయాలు వేరు ప్రజల ప్రాణాలు వేరని, ముఖ్యంగా నిరుపేదలు ఆశ్రయించే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందన్నారు.వైద్య వృత్తిని ప్రజలు ఎంతో పవిత్రంగా భావిస్తారని, వైద్యులను భగవంతుడితో సమానంగా గౌరవిస్తారని సండ్ర గుర్తుచేశారు. వైద్యులు, సిబ్బంది అవసరమైన సమయంలో రోగులకు అందుబాటులో ఉండటంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్యం అందించేలా విధులను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి మంచి పేరు వచ్చేలా వైద్య సేవలను మెరుగుపరచాలని, ఓపీ విభాగంతో పాటు అన్ని విభాగాల్లోనూ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సండ్ర కోరారు. వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించి, వారి ప్రాణాలను కాపాడటమే ప్రధాన కర్తవ్యంగా భావించాలని సూచించారు.ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు, సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి అన్నారు. ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి అని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# బాలికలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి: ఎస్సై షాహినా

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బాలికలు సామాజిక మాధ్యమానికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టి భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవాలని భరోసా ఎస్సై షాహినా పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ హెడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైరా రోడ్డు నందు గల శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యా సౌధ క్యాంపస్ నందు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాలికలు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోకూడదన్నారు. మన ఫోటోలు, ఇంటి చిరునామా, ఫోన్ నంబర్, పాస్వర్డ్ వంటి వివరాలను ఎవరికీ ఇవ్వకూడదు అని తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియాలో వేధించినా, బెదిరించినా, అనుచితమైన సందేశాలు పంపినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని, డయల్ 112 కి , 1930 ఫోన్ చేసి సహాయం పొందాలని అన్నారు. తప్పు చేసిన వ్యక్తి గురించి చెప్పడం మన బలహీనత కాదు. అది మన ధైర్యం అని బాలికలలో ధైర్యం నింపారు.మరో అతిథి డాక్టర్ అమీనా మాట్లాడుతూ... కిశోర వయస్సు అనేది మన శరీరంలో, మనసులో అనేక మార్పులు జరిగే ముఖ్యమైన దశ. ఈ సమయంలో శారీరక మార్పులు రావడం సహజం. వాటి గురించి భయపడాల్సిన అవసరం లేదు, సిగ్గుపడాల్సిన అవసరం కూడా లేదు. సరైన సమాచారం తెలుసుకొని, అవసరమైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా దగ్గరలో ఉన్న ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలి. ప్రతి రోజు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ముఖ్యంగా నెలసరి సమయంలో పరిశుభ్రత చాలా అవసరం అని అన్నారు. శుభ్రమైన, సురక్షితమైన శానిటరీ ప్యాడ్, ఇతర పరిశుభ్రమైన నెలసరి ఉత్పత్తులను ఉపయోగించాలి అని సూచించారు. మంచి ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవడం చాలా ముఖ్యం అని తెలిపారు. బాలికలు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. హెచ్పీవీ వ్యాక్సిన్ ప్రతి బాలిక తీసుకోవాలని తద్వారా గర్భాశయం ద్వారా క్యాన్సర్ ను నివారించడం సులువుతుందని సూచించారు. మరో అతిధి డాక్టర్ సోహెల్ మాట్లాడుతూ... మంచి ఆరోగ్యం అంటే కేవలం శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం. జీవితంలో కొన్ని సమస్యలు, అపజయాలు లేదా నిరాశలు రావడం సహజం. కానీ వాటిని చూసి భయపడకుండా, "నేను ఈ సమస్యను ఎదుర్కోగలను, నేను నేర్చుకోగలను, నేను ముందుకు సాగగలను" అనే సానుకూల ఆలోచన కలిగి ఉండాలని తెలిపారు. సహాయం కొరకు 14416నెంబర్ కు ఏ సమయం లోనైనా ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే అర్థాలను ఇబ్బందులను చట్టపరంగా విధించే శిక్షలు జరిమానాల గురించి వివరించారు. 2030 కల్లా బాల్య వివాహ రహిత భారతదేశానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల గురించి తెలిసినట్ల యితే 1098 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కే శ్రీనివాస్, ఎస్సై షాహినా, డాక్టర్ అమీనా డాక్టర్ సోహెల్ డాక్టర్ అరుణ, భరోసా సెంటర్ రాజకుమారి, సంధ్య, భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ అనిత తదితరులు పాల్గొన్నారు.




# 22-ఏ భూముల బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి

**● బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి రాజు అడిచర్ల డిమాండ్**




**కరీంనగర్ టౌన్ ఆగస్టు 22(పిసి డబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేట్, పట్టా భూములు చేరడంతో మధ్యతరగతి మరియు పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి రాజు అడిచర్ల ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ రూపాయి రూపాయి కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుందామన్నా, భవిష్యత్తులో పిల్లల పెళ్లిళ్ల కోసం గుంట భూమి కొనుక్కున్నా రిజిస్ట్రేషన్లు కాక యజమానులు అరిగోస పడుతున్నారన్నారు. 22-ఏ నిబంధన ఉద్దేశం చట్టపరంగా బదలాయింపు నిషేధిత భూములను రక్షించడం కానీ, చట్టబద్ధమైన పట్టాదారుల హక్కులను దెబ్బతీయడం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యంపై ప్రధాన డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించి, 2023 డిసెంబర్ నుంచి జరిగిన మార్పులపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలనీ, 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 22-ఏ జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి సర్వే నంబర్ వివరాలను ప్రజల ముందుంచాలి. ఏ చట్టం, జీఓ లేదా కోర్టు ఉత్తర్వు ఆధారంగా వీటిని చేర్చారో స్పష్టం చేయాలని అన్నారు.. ఒకే సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి, ప్రైవేట్ భూమి ఉంటే రెండింటినీ వేరు చేసి నిజమైన పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం కల్పించాలనీ, ప్రజలను రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిప్పకుండా దరఖాస్తుల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించాలన్నారు. అధికారుల తప్పిదాల వల్ల ఆర్థికంగా నష్టపోయిన భూయజమా నులకు బాధ్యత ఎవరిదో ప్రభుత్వం చెప్పాలి. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం ఉన్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి "ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో, చట్టబద్ధమైన ప్రైవేట్ భూములపై ప్రజల హక్కులను కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని, 22-ఏ పేరుతో నిజమైన పట్టాదారుడికి అన్యా యం జరగదని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఆచరణలో చూపించాలనీ డిమాండ్ చేశారు.ప్రజల భూముల విషయంలో రాజకీయాలు కాకుండా పారదర్శకత, బాధ్యత, కాలపరిమితితో కూడిన పరిష్కారం చూపాలని రాజు అడిచర్ల డిమాండ్ చేశారు.

# పెన్షనర్ల కన్నీళ్లకు ప్రభుత్వం స్పందించాలి

**మూడేళ్ల నిరీక్షణ.. తీరని బకాయిలు**

**ప్రీమియం తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ.. వైద్య సేవలు అందించడంలో ఎందుకు లేదు**

**పీఆర్సీ, డీఏలను వెంటనే విడుదల చేయాలి**

**రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య**

ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఉద్యోగ విరమణ అనంతరం ప్రశాంతమైన జీవితం గడపాల్సిన పెన్షనర్లు.. తమకు రావాల్సిన బకాయిల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొనడం బాధాకరమని, పెన్షనర్ల కన్నీళ్లు ప్రభుత్వానికి పట్టదా అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత కూడా తమ హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తక్షణమే మార్చుకోవాలని, వారి న్యాయమైన సమస్యలను కాలయాపన లేకుండా పరిష్కరించాలని పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం కృషిభవన్‌లో ఎస్జిపిఏటి ముఖ్యకార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగింది.

**మూడేళ్ల నిరీక్షణ.. తీరని బకాయిలు :** మూడు సంవత్సరాలు గడిచినా ఉద్యోగులు, పెన్షనర్ల ఉమ్మడి డిమాండ్లైన పీఆర్సీ, ఆరు డీఏల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని ఆయన విమర్శించారు. జీవితాంతం ప్రభుత్వ సేవలో నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రభుత్వం కల్పించడం సరికాదన్నారు. ముఖ్యంగా 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించకపోవడం వారి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసిన తర్వాత వచ్చే బకాయిలే అనేక కుటుంబాలకు ఆధారమని, వాటి కోసం నెలల తరబడి ఎదురుచూసేలా చేయడం పెన్షనర్ల పట్ల మానవీయత లేని ప్రభుత్వ విధానానికి నిదర్శనమని అన్నారు.

**ప్రీమియం తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ.. వైద్య సేవలు అందించడంలో ఎందుకు లేదు** మరోవైపు నగదు రహిత వైద్య సేవలను సమర్థవంతంగా అమలు చేయడంలో విఫలమవుతోందని పరిశ పుల్లయ్య ఆరోపించారు. వయసు పైబడిన పెన్షనర్లు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లిన సమయంలో ఆరోగ్య పథకం అందుబాటులో లేకపోవడం వారి కుటుంబాలకు మరింత




భారంగా మారుతోందన్నారు. ప్రీమియం తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ.. వైద్య సేవలు అందించడంలో ఎందుకు లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయడంలో కూడా ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ జీవితకాల సేవకు ప్రతిఫలంగా కోరుతున్న హక్కులను ప్రభుత్వం దయాదాక్షిణ్యాలుగా చూడకూడదని స్పష్టం చేశారు.

**బకాయిలు విడుదల చేసి.. పీఆర్సీ, డీఏలు ప్రకటించాలి :** ఇప్పటికైనా ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా కార్యాచరణకు దిగాలని పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. పెన్షనర్లకు రావాల్సిన అన్ని బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. నగదు రహిత వైద్య సేవలను సమర్థవంతంగా అమలు చేసి వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు భరోసా కల్పించాలని అన్నారు. పెన్షనర్లు తమ హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితిని ప్రభుత్వం ఇకనైనా ముగించాలని, ఉద్యోగ విరమణ తర్వాత కూడా తమ హక్కుల కోసం పోరాడాల్సిన దుస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పెన్షనర్ల కన్నీళ్లను, కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం అర్థం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని హెచ్చరించారు.

**హక్కుల సాధనకు పోరుబాట.. ఆగస్టు 27న మహాధర్నా!** పెన్షనర్లు, ఉద్యోగుల ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ పిలుపు మేరకు ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వందలాది మంది పెన్షనర్లు మహాధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి తమ ఐక్యత, సత్తా చాటాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేరిఏసుపాదం, జిల్లా నాయకులు రవికుమార్, తాడి అంజలి, ఊడుగు వెంకటేశ్వర్లు, బెల్లం రాధాకృష్ణమూర్తి, కనపర్తి నాగప్రసాద్, ఊడుగు సుధాకర్ రావు, యండి హుస్సేన్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించి పరిహారం చెల్లించాలి

**రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్**

**కరీంనగర్ జిల్లా ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని నారాయణపూర్ గ్రామంలో నారాయణపూర్ రిజర్వాయర్ ఆనుకొని ఉన్న నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని గ్రామస్తులు గంగాధర మండల కేంద్రానికి ర్యాలీగా వచ్చి రాస్తారోకో నిర్వహించారు. ఈ ర్యాలీ, రాస్తారోకోలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పాల్గొని గ్రామస్తులకు సంఘీభావం, మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలతో గ్రామ ప్రజలు రోడ్డెక్కి దుస్థితి రావడం విచారకరమన్నారు. నారాయణపూర్ గ్రామాన్ని తక్షణమే ముంపు గ్రామంగా ప్రకటించాలని, రెండు దశాబ్దాల నుండి ఇక్కడ నివసిస్తున్న కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామస్తుల ఆందోళనలో పాల్గొని నాటి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మేడిపల్లి సత్యం నేను గెలిచిన తర్వాత రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, ముంపు గ్రామంగా ప్రకటిస్తానని చెప్పి ఓట్లు వేపించుకొని నేడు ముఖం చాటేసే పరిస్థితి దాపురించిందని విమర్శించారు. చొప్పదండి ఎమ్మెల్యే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, గెలిచిన తర్వాత మరో మాట మాట్లాడడం మేడిపల్లి సత్యం కు తగదన్నారు.గ్రామ ప్రజల దీక్షలను సందర్శించి గ్రామస్తులకు స్పష్టమైన హామీ ఇచ్చి దీక్షలను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు కూడా నారాయణపూర్ గ్రామ ప్రజల సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. న్యాయబద్ధంగా ప్రజా స్వామ్య యుతంగా నారాయణపూర్ గ్రామ ప్రజలు తమ న్యాయమైన హక్కులు



,డిమాండ్ల కోసం చేస్తున్న ఉద్యమాన్ని నీరు కార్చేందుకు రాజకీయ దురుద్దేశంతో ఉద్యమాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాన్ని మానుకోవాలని హితవు పలికారు. గ్రామ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తూ రాజకీయ పబ్బం గడుపుకునే వారి పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్షణమే నారాయణపూర్ గ్రామ ప్రజల న్యాయమైన డిమాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి సత్వరమే పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో రాజకీయ పార్టీలు జోక్యం జోక్యం చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. పేరు కోసం పాకులాడకుండారాజకీయాలను పక్కనపెట్టి గ్రామస్తుల డిమాండ్ ను పరిష్కరించాలన్నారు. ముంపు గ్రామంగా ప్రకటించి, నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాల ముందు ఏ ప్రభుత్వాలు నిలబడలేవన్నారు. రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా విస్తరించక ముందే నారాయణపూర్ గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు చేసే న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ పార్టీ ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతుగా ఎల్లప్పుడూ ఉంటుందని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, కమిటీ సభ్యులు జి రాజేశం, డి నరేష్ పటేల్, నాయకులు శివ, నారాయణపూర్ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పాదయాత్ర చరిత్రాత్మకం

**ఇండ్ల స్థలాల కోసం రోడ్డెక్కిన కలం సైన్యం**

**షోయాబుల్లాఖాన్ స్ఫూర్తితో**

**సుబ్లేడు నుంచి పోరాట పయనం**

**ఇండ్ల స్థలాలు సాధించేవరకూ పోరాటం**

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి**









**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి నిత్యం అక్షరాలతో పోరాడే జర్నలిస్టులు.. తమ న్యాయమైన హక్కుల కోసం తొలిసారి రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్-2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు అడుగడుగునా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. జర్నలిస్టుల హక్కుల కోసం సాగుతున్న ఈ పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయే ఉద్యమంగా మారుతుందని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

**షోయాబుల్లాఖాన్ అడుగుజాడల్లో.. జర్నలిస్టుల హక్కుల బాటలో** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలంతో పోరాడి, రజాకారుల చేతుల్లో పాశవికంగా హతమైన తొలితరం జర్నలిస్టు షోయాబుల్లాఖాన్ జన్మస్థలమైన సుబ్లేడు గ్రామం నుంచి పాలేరు నియోజకవర్గంలో ఈ చారిత్రాత్మక పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం జర్నలిస్టులు పాదయాత్రను ప్రారంభించారు. ప్రజల గొంతుకగా నిలిచిన షోయాబుల్లాఖాన్ స్ఫూర్తితో.. నేటి జర్నలిస్టుల హక్కుల కోసం సాగుతున్న ఈ పోరాటం అక్షరానికి ఉన్న శక్తిని మరోసారి చాటిచెబుతోందని నాయకులు పేర్కొన్నారు.

**అడుగడుగునా ప్రజల హారతులు.. రాజకీయ, ప్రజా సంఘాల సంఘీభావం** జర్నలిస్టుల పాదయాత్రకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. కోలాటాలు, డప్పు వాయిద్యాలతో కళాకారులు పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చి అడుగడుగునా జర్నలిస్టులకు బ్రహ్మరథం పట్టారు. ఘనంగా స్వాగతించారు. ప్రజల సమస్యల కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టులు తమ సమస్యల కోసం రోడ్డెక్కడం బాధాకరమని, వారి న్యాయమైన పోరాటానికి అండగా నిలుస్తామని వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

**తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే ప్రత్యేక అధ్యాయం :** జర్నలిస్టుల హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ పాదయాత్ర తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తుందని టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు పేర్కొన్నారు. భారతదేశంలో ఒడిశాలో తొలిసారి జర్నలిస్టులు హక్కుల కోసం పాదయాత్ర చేపట్టిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, అదే స్ఫూర్తితో తెలంగాణలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

**హామీ కాదు.. హక్కుగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలి** ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన ఇండ్ల స్థలాల హామీని ఇక ఆలస్యం చేయకుండా అమలు చేయాలని వారు కోరారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ.. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులకు సొంత ఇంటి కల కూడా నెరవేరకపోవడం ఆవేదనకరమన్నారు. ఎన్నో కుటుంబాల కన్నీళ్లను వార్తలుగా మార్చే జర్నలిస్టుల జీవితాల్లోనూ ఒక వెలుగు నింపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. “ఇండ్ల స్థలాలు సాధించే వరకు ఈ పోరాటం ఆగదు.. జర్నలిస్టుల హక్కు సాధించే వరకు ప్రతి అడుగు ముందుకే” అని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి జర్నలిస్టు అడుగు కలపాలి.. ప్రభుత్వం స్పందించాలన్నారు. ఇది ఒక్క సంఘం పోరాటం కాదని.. ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి జర్నలిస్టు కుటుంబం యొక్క ఆకాంక్ష అని వారు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి జర్నలిస్టు ఈ పాదయాత్రలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఒకరి అడుగు మరొకరికి బలంగా మారాలని, జర్నలిస్టుల ఐక్యతే ప్రభుత్వంపై న్యాయమైన ఒత్తిడిని







పెంచుతుందని అన్నారు. జర్నలిస్టుల పాదయాత్రకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కళాకారులు, మహిళలు, ప్రజలకు టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల గొంతుకగా నిలిచే జర్నలిస్టుల గొంతును ప్రభుత్వం కూడా ఆలకించి, ఇచ్చిన హామీని అమలు చేస్తూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు పారుపల్లి కృష్ణారావు, జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, షేక్ జానీ పాషా, టీబీటీఏ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, స్టేట్ ఈసీ మెంబర్ టిఎస్ చక్రవర్తి, స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ బాలక్రిష్ణ, నలుబోలు మధుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్ బి. ప్రసేన్, మారెడ్డి నాగేందర్ రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు నాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, పెంద్ర అంజయ్య, ఎన్.డి కర్ణ, దగ్గుపాటి మాధవరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, బంక వెంకటేశ్వర్లు, గంగుల గోపి, గణేష్, అర్షద్, యూసఫ్, సతీష్, స్థానిక సర్పంచ్ సంఘబత్తుల స్వాతి-సుమన్ రెడ్డి, బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీధర్ రెడ్డి, తకెళ్లపల్లి నరేందర్ రావు, బొడ్డుపల్లి నాగప్రసాద్, నల్లగట్టు శ్రీనివాస్, సిపి(ఐ)ఎం రాష్ట్ర నాయకులు బండి రమేష్, బషీరుద్దీన్ కొమ్ము శ్రీను, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజపంథా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు, సీపీఐ ఎంఎల్ న్యూ డేమోక్రసి నాయకులు గొర్రెపాటి రమేష్, బీఎస్పీ ఎన్నబోయిన రమేష్, నల్లగట్టు శంకర్, సీఐటీయూ నాయకులు వశపొంగు వీరన్న, ఎంఆర్పీఎస్ నాయకులు చింతరాల నాగభూషణం, టిజేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

● బీపీఎల్ కోటాలో ఇచ్చినా అభ్యంతరంలేదు ● టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి ● జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశాన్ని పరిశీలిస్తాం..! ● టీడబ్ల్యూజేఎఫ్ నాయకుల వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ దివాకర



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ హామీని అమలు చేయాలి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని పాలేరు నియోజకవర్గంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర శనివారం మధ్యాహ్నం ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలానికి కేంద్రానికి చేరుకుంది. కూసుమంచి మండల కేంద్రంలో ఉన్న జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర ను కలసి టీడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) కోటా, మరోరకంగానైనా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర సూచించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) శనివారం చేపట్టిన పాదయాత్రలో భాగంగా కూసుమంచి తహాశీల్దారు కార్యాలయంలో తనను కలిసిన జర్నలిస్టుల పాదయాత్ర బృందానికి కలెక్టర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి లు మాట్లాడుతూ.. గత, ప్రస్తుత ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చాయని, జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని అవసరమైతే బిపిఎల్ కోటా లోనైనా ఇచ్చిన అభ్యంతరం లేదని విన్నవించారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టినట్లు వారు తెలిపారు. ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాటం కొనసాగిస్తామని వివరించారు. ఏదో ఒక రకంగా ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాల్సిందిగా వారు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సొసైటీల ద్వారా ఇవ్వడం సాధ్యం కాదని, న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఏ రకంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వవచ్చో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట కూసుమంచి తహశీల్దారు సైదులు కూడా ఉన్నారు. అంతకుముందు పాదయాత్ర బృందానికి ప్రైవేట్ ఉపాధ్యాయుల బృందం ఘనంగా స్వాగతం పలికింది. పాదయాత్ర చేస్తున్న జర్నలిస్టులకు జర్నలిస్టుల పిల్లలు పూలమాలలు వేసి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఇర్షాద్, అజీజ్, శేఖర్ రెడ్డి, ప్రసాద్, కిరణ్, పెండ్ర అంజయ్య, కొమ్ము ప్రభాకర్, పందిరి వెంకట్ రెడ్డి, గర్నె నాగేశ్వరరావు, కర్ణబాబు, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.




# రవితేజ 'ఇరుముడి' జోరు.. అదనపు స్క్రీన్లు, షోలు

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుండటంతో, తెలుగు రాష్ట్రాల్లో అదనపు షోలను, మరిన్ని థియేటర్లను జోడిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేకర్స్ తెలిపారు.ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ మంచి వసూళ్లను సాధిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొత్త థియేటర్లను జోడించడంతో పాటు, ఉన్న థియేటర్లలోనూ అదనపు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది.'రవన్న బాక్సాఫీస్ దండయాత్ర' కొనసాగుతోందని చిత్రబృందం ప్రచార చిత్రాల ద్వారా పేర్కొంటోంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం అదనపు ఆకర్షణగా నిలిచింది. టీ-సిరీస్ ఫిలిమ్స్ సమర్పణలో విడుదలైన 'ఇరుముడి', రవితేజ అభిమానులను, మాస్ సినీ ప్రియులను అలరిస్తూ థియేటర్లలో విజయవంతంగా తన ప్రదర్శనను కొనసాగిస్తోంది.

# 'అల బొలెలో' సాంగ్ పూర్ణ స్టెప్పులు అదుర్స్!

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమా నుంచి తొలి పాట 'అల బొలెలో'ను శుక్రవారం విడుదల చేసి అభిమానులకు పండగలాంటి వార్త చెప్పింది.
యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ ఫుట్ ట్యాపింగ్ నంబర్‌ను ఆయనే స్వయంగా ఆలపించడం విశేషం. దర్శకుడు అరుణ్‌రాజా కామరాజ్ దీనికి సాహిత్యం అందించారు. అయితే, ఈ పాటలో సంగీతం, సాహిత్యం కంటే ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సమకూర్చిన స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా నటి పూర్ణ (షామ్నా కాసిం) తన అద్భుతమైన డ్యాన్స్‌తో, హావభావాలతో ఎంతగానో ఆకట్టుకున్నారు.
ఆమె డ్యాన్స్ పాటకు ప్రత్యేక కళను తెచ్చిపెట్టింది. ఈ చిత్రంలో భాగం కావడంపై నటి పూర్ణ ఇటీవల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "'జైలర్ 2' లాంటి భారీ చిత్రంలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఇది ఒక కల నిజమైనట్లుంది" అంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు రజినీకాంత్, దర్శకుడు నెల్సన్, అనిరుధ్, జానీ మాస్టర్‌తో పాటు చిత్ర బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. గతంలో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ టీజర్‌లో నటుడు వినాయకన్ చెప్పిన డైలాగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. "నన్ను చంపి నువ్వు ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్!" అంటూ ఆయన చెప్పే డైలాగ్, ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్ ఎంట్రీ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.




# 'స్పిరిట్' వివాదం.. ఒక్క 'లైక్'తో వంగా బ్రదర్స్‌కు దీపిక పదుకొణె స్ట్రాంగ్ రిప్లై

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం 'స్పిరిట్' చుట్టూ అలుముకున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంపై నిర్మాత, సందీప్ రెడ్డి సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా చేసిన ఆరోపణలకు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొణె పరోక్షంగా, కానీ చాలా బలంగా స్పందించారు. వంగా సోదరులను విమర్శిస్తూ రాసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను 'లైక్' చేయడం ద్వారా ఆమె తన వైఖరిని స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ.. దీపిక ఈ సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడిగారని, డేట్స్ సర్దుబాటు చేయలేకపోయారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా చర్చలు విఫలమయ్యాక సినిమా కథ, పాత్రకు సంబంధించిన అంతర్గత విషయాలను ఆమె లీక్ చేశారని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్థికంగా తమకు వర్కవుట్ కాకపోవడం వల్లే ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని వివరించారు. ఈ ఆరోపణలపై దీపిక నేరుగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ, ఓ జర్నలిస్ట్ పెట్టిన పోస్ట్‌కు ఆమె మద్దతు తెలిపారు. "దీపిక 10% లాభం అడిగితే, మొత్తం వంగా ఆస్తిని అడిగినట్టు ఎందుకు ఫీల్ అవుతున్నారు? ఇది స్పష్టంగా మగ అహంకార సంక్షోభం. ఒక మహిళ 'నో' చెప్పడాన్ని వీరు జీర్ణించుకోలేకపోతున్నారు" అని ఆ పోస్ట్‌లో జర్నలిస్ట్ పేర్కొన్నారు. ఏళ్ల తరబడి మగ స్టార్లు లాభాల్లో వాటాలు, అనుకూలమైన పని గంటలు వంటివి డిమాండ్ చేస్తున్నారని, అలా చేస్తే వారిని 'క్రమశిక్షణ' గలవారని అంటారని, అదే ఒక మహిళా స్టార్ అడిగితే 'ఇబ్బంది పెట్టే వ్యక్తి'గా ముద్ర వేస్తారని ఆ పోస్ట్ విమర్శించారు. ఒప్పందం రద్దయి నెలలు గడుస్తున్నా వంగా సోదరులు ఇంకా ఆమె గురించే మాట్లాడటం వృత్తి నైపుణ్యం కాదని, ఇది పూర్తిగా లింగ వివక్ష, మగ అహంకారమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. "ఆమె నో చెప్పింది. దాన్ని అంగీకరించి ముందుకు సాగండి" అంటూ పోస్ట్‌లో జర్నలిస్ట్ రాసుకొచ్చారు. మొత్తానికి దీపిక నేరుగా స్పందించకపోయినా తన మద్దతు ద్వారా ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు. కేవలం రెమ్యూనరేషన్, డేట్స్ సమస్యగా మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు ఇండస్ట్రీలో లింగ సమానత్వం, మగ అహంకారంపై తీవ్ర చర్చకు దారితీసింది.



# ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్' ట్యాగ్‌పై ప్రభాస్ రియాక్షన్

భారతీయ సినీ పరిశ్రమలో -బాహుబలి- చిత్రంతో పాన్-ఇండియా సంస్కృతికి శ్రీకారం చుట్టిన ప్రభాస్ తన ఇమేజ్‌కు ఏమాత్రం గర్వం ఆపాదించుకోని అరుదైన వ్యక్తిత్వంతో కనిపిస్తారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -స్పిరిట్-లో ప్రభాస్ పేరు ముందు -ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్- అని వేయబోతున్నారనే వార్త అప్పట్లో సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ భారీ ట్యాగ్‌ను ప్రభాస్ ఎలా స్వీకరించారనే దానిపై నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా స్పందిస్తూ.. ప్రభాస్ గారి స్వభావానికి అద్దం పట్టే పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సాధారణంగా నటులు తమ బిరుదులు, ప్రచార ట్యాగ్‌ల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అయితే ప్రభాస్ విషయంలో ఈ ప్రకటన ఎలా జరిగింది అన్న ప్రశ్నపై నిర్మాత వివరణ ఇస్తూ... టైటిల్ ఆవిష్కరణకు ముందే ఈ అంశాన్ని ఆయనతో ప్రస్తావించినట్లు తెలిపారు. దీనికి ప్రభాస్ ఎంతో క్యాజువల్‌గా తన సహజ సిద్ధమైన శైలిలో -మీ ఇష్టం డార్లింగ్- అంటూ ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా అంగీకారం తెలిపారట. ఈ ఒక్క చిన్న సమాధానం ప్రభాస్ నిరాడంబరతను, మేకర్స్‌పై ఆయనకు ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న ప్రభాస్ షూటింగ్ షెడ్యూళ్ల సర్దుబాటులో ఎంతో ఫ్లెక్సిబుల్‌గా వ్యవహరిస్తున్నారని నిర్మాత ప్రణయ్ వంగా పేర్కొన్నారు. ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న -ఫౌజీ- చిత్రం పూర్తయిన వెంటనే.. ఆయన పూర్తి స్థాయిలో -స్పిరిట్- సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు. రెండు భిన్నమైన మేకింగ్ శైలులు కలిగిన సినిమాల మధ్య ఎంతో నైపుణ్యంతో సమన్వయం పాటిస్తూ.. ప్రభాస్ డేట్లను కేటాయిస్తున్నారని ప్రణయ్ రెడ్డి వంగా కొనియాడారు.



# సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

తమిళ చిత్ర పరిశ్రమలో మరోసారి సంక్షోభం నెలకొంది. ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో, 2026 సెప్టెంబర్ 1 నుంచి కొత్త సినిమాల విడుదలను నిలిపివేయాలని తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివాదానికి ప్రధాన కారణం.. థియేటర్లలో విడుదలైన సినిమాలను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ చేసే కాలపరిమితి. సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలోకి రావాలని థియేటర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సినిమాలు త్వరగా ఓటీటీలో అందుబాటులోకి రావడం వల్ల ప్రేక్షకులు థియేటర్లకు రావడం తగ్గుతోందని, తద్వారా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిర్మాతలు మాత్రం తమ వాణిజ్యపరమైన వెసులుబాటును కోరుకుంటున్నారు. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు కొత్త సినిమాలను విడుదల చేయకూడదని నిర్మాతల మండలి స్పష్టం చేసింది. అయితే, ఇది పూర్తిస్థాయి బంద్ కాదని, సినిమా షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, తమిళనాడు థియేటర్ యజమానుల సంఘం ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం సెప్టెంబర్ నెలతో పాటు ఆ తర్వాత విడుదల కావాల్సిన పలు చిత్రాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

